
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025

I



సోమశిలలో 72.44 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో బుధవారం సాయంత్రానికి 72.44 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 13,350 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,17,400
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.10,581
3 శాతం జీఎస్టీతో	రూ.10,898
నవర (8 గ్రా)	రూ.87,184



వాతావరణం

జిల్లాలో ఉక్కపోత వాతావరణం గురువారం ఉంటుందని అధికారులు తెలిపారు. గాలిలో తేమ 58 శాతంగా బుధవారం నమోదైంది.

న్యూస్‌రీల్

ఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్‌ఈగా రాఘవేంద్రం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈగా జిల్లాకు చెందిన కొండూరు రాఘవేంద్రం నియమితులయ్యారు. ఈ మేరకు విద్యుత్ భవన్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలను బుధవారం చేపట్టారు. సత్యసాయి జిల్లాలో ఈఈగా పనిచేస్తున్న ఈయన ఉద్యోగోన్నతిపై ఇక్కడ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఎస్‌ఈగా పనిచేసిన విజయన్.. తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో జీఎం (సోలార్ కార్పొరేషన్)గా ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాఘవేంద్రం మాట్లాడారు. వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను అందిస్తామని వివరించారు. కాగా ఆయనకు పలువురు అభినందనలను తెలియజేశారు.

వెంకటాచలం సర్పంచ్ చెక్ పవర్ రద్దు

నెల్లూరు(పొగతోట): నిధులు దుర్వినియోగం చేశారనే అభియోగాలపై వెంకటాచలం సర్పంచ్ రాజేశ్వరి చెక్ పవర్‌ను ఆర్నెల్ల పాటు రద్దు చేస్తూ ఉత్తర్వులను డీపీఓ శ్రీధర్‌రెడ్డి బుధవారం జారీ చేశారు. నిధుల దుర్వినియోగంపై కావలి డివిజనల్ పంచాయతీ అధికారి విచారణ జరిపి నివేదికలను సమర్పించారని వివరించారు. సర్పంచ్ సమర్పించిన సంజాయిషీ ఆమోదయోగ్యంగా లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.





పసిడికి పన్నుపోటు.. జీఎస్టీకి వెన్నుపోటు

- బంగారంపై జిల్లాలో భారీగా పన్ను ఎగవేత
- చెన్నై, ముంబై నుంచి అనధికారికంగా తీసుకొస్తూ..
- కొనుగోలు, విక్రయాలపై మూడు శాతం జీఎస్టీ
- బిల్లులన్నీ తెల్ల కాగితాలపైనే అందజేత
- ఒరిజినల్ అడిగితే అదనంగా చెల్లించాల్సిందే
- అధికారులకు మామూళ్లు

నెల్లూరు (టౌన్): జీరో దందా.. దోపిడీకి అండగా నిలుస్తోంది. జిల్లాలో బంగారంపై ఈ తంతు నిత్యం జరుగుతూనే ఉంది. ఎలాంటి పన్ను చెల్లించకుండా చెన్నై, ముంబై ప్రాంతాల నుంచి భారీ మొత్తంలో అక్రమంగా జిల్లాకు తీసుకొచ్చారనే అంశంపై ఆదాయ పన్ను శాఖ అధికారులు ఈ నెల 17న విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టారు. నగరంలోని డీపీ, జేటీ హోల్‌సేల్ దుకాణాల్లో రికార్డులను ఢిల్లీ నుంచి వచ్చిన ఆ శాఖ ప్రత్యేక బృందం పరిశీలించింది.

భారీగా తేడాల గుర్తింపు

బంగారానికి సంబంధించిన కొనుగోళ్లు, విక్రయాల్లో భారీగా తేడాలను వారు గుర్తించారు. 500 నుంచి 600 కిలోలకు సంబంధించి ఆదాయ పన్నును ఆర్నెల్ల క్రితం చెల్లించకుండా కొద్ది రోజుల్లోనే విక్రయించారనే అంశాన్ని కనుగొన్నారు. జిల్లాలో ఈ రెండు దుకాణాలే కాకుండా అధిక శాతం షాపులు ఇదే తీరును అవలంబిస్తూ ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించకుండా పెద్ద మొత్తంలో విక్రయిస్తూ కోట్లాది రూపాయలను ఆర్జిస్తున్నారు.

అందరి చూపు పసిడివైపే..

బంగారం ధరలు రోజురోజుకూ ఆకాశాన్నంటుతున్నాయి. ఇతరులకు అప్పివ్వడం, స్థిర, చరాస్తులపై పెట్టుబడుల కంటే దీనిపై ఇన్వెస్ట్ చేస్తే ఉన్నతంగా ఉంటామనే ఆలోచన ఎక్కువ మందిలో నెలకొంది. రానున్న రోజుల్లో మరింతగా పెరిగితే కొనుగోలు చేయడం కష్టంగా మారుతుందేమోననే భావన మధ్యతరగతి ప్రజల్లో సైతం ఉంది. ఈ నేపథ్యంలో జిల్లాలో డబ్బెక్కువగా ఉన్నవారు.. అవసరం నిమిత్తం మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.

నిత్యం.. భారీగా

జిల్లా వ్యాప్తంగా పెద్ద, చిన్న బంగారు దుకాణాలు వెయ్యికిపైగా ఉన్నాయి. ఒక్క నెల్లూరు నగరంలోనే 600కుపైగా ఉన్నాయి. నగరంలో ఒకప్పుడు ఒకే ప్రాంతంలో ఉండే ఇవి, ప్రస్తుతం ప్రతి కూడలిలో కొలువుదీరాయి. నిత్యం ఇక్కడ రూ.150 కోట్లకు పైగా వ్యాపారం జరుగుతోంది. చెన్నై, ముంబైతో పాటు మధ్య ప్రాచ్య దేశాల నుంచి అనధికారికంగా భారీ మొత్తంలో పెద్ద షాపుల వారు తీసుకొస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు పసిడి విక్రయాలు, కొనుగోళ్లకు సంబంధించి మూడు శాతం జీఎస్టీని వ్యాపారులు చెల్లించాల్సి ఉంది. ఈ మేరకు వినియోగదారులకు బిల్లివ్వాల్సి ఉంది. ప్రభుత్వాదాయానికి చిల్లుపెడుతూ జిల్లాలో జీరో దందా జోరుగా కొనసాగుతోంది. వాస్తవానికి బంగారు కొనుగోళ్లు, విక్రయాలపై మూడు శాతం జీఎస్టీని చెల్లించాలనే నిబంధన ఉన్నా, అదెక్కడా అమలుకావడంలేదు. చెన్నై, ముంబై నుంచి అనధికారికంగా కొందరు తీసుకొచ్చి తమ బిజినెస్‌ను మూడు గ్రాములు.. ఆరు కాసులు అన్నట్లుగా సాగిస్తున్నారు. బిల్లును చెల్లించాలనే రూల్‌నూ పాటించడంలేదు. ఒకవేళ ఎవరైనా ప్రశ్నిస్తే, తెల్లకాగితంపై రాసి అంటగడుతున్నారు. ఈ తంతుపై అధికారులకు తెలిసినా, మామూళ్ల మత్తులో మునిగి పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

> **తనిఖీలు చేస్తాం**
>
> ఎలాంటి పన్నులు చెల్లించకుండా విక్రయాలు సాగిస్తున్న బంగారు దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తాం. దీనికి గానూ ఎలాంటి వే బిల్లు ల్లేవు. ఫిర్యాదొస్తే తప్ప తనిఖీ చేసే పరిస్థితి లేదు. ట్యాక్స్ చెల్లించకుండా అనధికారికంగా బంగారాన్ని విక్రయిస్తున్న విషయాన్ని మా దృష్టికి తీసుకురావాలి. బాధ్యతలను ఇటీవలే స్వీకరించా. పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు చేపడతా.
>
> – కిరణ్, జేసీ, వాణిజ్య పన్నుల శాఖ

పెద్ద ఎత్తున గండి

జిల్లాలో నిత్యం రూ.150 కోట్లకుపైగా వ్యాపారం జరుగుతున్న తరుణంలో మూడు శాతం జీఎస్టీ కింద రూ.4.5 కోట్లను చెల్లించాల్సి ఉంటుంది. సెలవులు, అన్ సీజన్ రోజులను తీస్తే సగటున 20 రోజులకు రూ.90 కోట్లు ప్రభుత్వానికి జమకావాలి. అయితే ఏడాదికి రూ.వంద కోట్లు సైతం అందడం లేదని తెలుస్తోంది.

తరుగు, తూకాల్లోనూ మోసం

మరోవైపు తూకాలు, తరుగు రూపాల్లోనూ వినియోగదారులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. జీఎస్టీ, తూనికలు, కొలతలు అధికారులు ఏ రోజూ తనిఖీ చేసిన సందర్భాల్లేవు. దీంతో విక్రేతలు యథేచ్ఛగా దోపిడీ చేస్తున్నారు.

.. ష్..గప్‌చుప్



మామూళ్ల మత్తులో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు జోగుతున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. తనిఖీలు చేపట్టాల్సి ఉన్నా, అటువైపు కన్నెత్తి చూడటం లేదు. దీనికి గానూ ప్రతిఫలంగా వ్యాపారుల నుంచి పెద్ద మొత్తంలో స్వీకరిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. నెల్లూరు నగరంలో నెలవారీగా.. అదే మున్సిపాల్టీలు, చిన్న పట్టణాల్లో ఏడాదికోసారి పుచ్చుకుంటున్నారని సమాచారం. నగరంలో ఇలా నెలకు రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ముట్టజెప్తున్నారని తెలుస్తోంది. తూనికలు, కొలతల శాఖ అధికారులకు సైతం ఇదే తరహాలో అందుతున్నాయి.

జీఎస్టీ తగ్గింపుతో ఎంతో ఉపయోగం



మాట్లాడుతున్న హిమాన్షు శుక్లా

- పాత రేట్ల మేరకు విక్రయిస్తే చర్యలు
- కలెక్టర్ హిమాన్షు శుక్లా


నెల్లూరు(అర్బన్): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణలతో అన్ని వర్గాలకు ఎంతో ఊరట లభించనుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. నగరంలోని కలెక్టరేట్లో జీఎస్టీ, నెల్లూరు డివిజన్ జాయింట్ కమిషనర్ కిరణ్‌తో కలిసి విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపుతో చిరువ్యాపారాలు పెరుగుతాయని, ఎమ్మెస్సెమ్‌ఈ పరిశ్రమలకు ప్రోత్సాహం లభించనుందని వెల్లడించారు. ఫలితంగా రానున్న రోజుల్లో అన్ని వర్గాల వారు జీఎస్టీ పరిధిలోకి వస్తారని, ప్రభుత్వానికి ఆదాయం భారీగా లభించనుందని పేర్కొన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు.. ఆరోగ్య రంగానికి సంబంధించిన మందులు, ఇన్సూరెన్స్ ప్రీమియం.. రైతులకు వ్యవసాయాధారిత ట్రాక్టర్, ఇతర పరికరాల ధరలు దిగొస్తాయని చెప్పారు. జీఎస్టీ అమలు తీరు పరిశీలనకు గానూ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, వ్యాపార సంస్థల్లో తనిఖీలను చేపట్టామని, అక్కడ రేట్లు తగ్గించారన్నారు. పాత ధరల మేరకు ఎక్కడైనా విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ట్యాక్స్ రిటర్న్‌ను ఆఫీసర్‌తో సంబంధంలేకుండా ఆన్‌లైన్లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను సైతం మూణ్నాలుగు రోజుల్లో చేసుకోవచ్చన్నారు. గ్రామస్థాయిలో పొదుపు సంఘాలు, ఇతరులకు ఈ నెల 30 వరకు అవగాహన కల్పించనున్నామని వెల్లడించారు. వ్యవసాయ రంగానికి ఎలా లబ్ధి చేకూరుతుందో 30 నుంచి వచ్చే నెల ఆరు వరకు వివరించనున్నామని.. ఇలా 19 వరకు కార్యక్రమాలను నిర్వహించి దీపావళి రోజున మెగా ఈవెంట్‌తో ముగించనున్నామని వివరించారు. ప్రధాని పిలుపు మేరకు స్వదేశీ వస్తువులను కొనుగోలు చేద్దామని పేర్కొన్నారు.

సంక్షోభంలో సజ్జ సాగు

- ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.2,775
- తగ్గించి కొంటున్న వ్యాపారులు
- తీవ్రంగా నష్టపోతున్న రైతు
- ఈ రేటుకే కొనుగోలు చేయాలంటూ అన్నదాతల ఆందోళన



ఉదయగిరి ప్రాంతంలో సాగులో ఉన్న సజ్జ



ఉదయగిరి: కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నాటి నుంచి వివిధ పంటలకు కనీస మద్దతు కరువై అన్నదాతలు కన్నీళ్లు పెడుతున్నారు. ఇప్పటికే వరి, పత్తి, వేరుశనగ, బత్తాయి, టమాటో, ఉల్లి సాగు చేసిన రైతులకు కనీస మద్దతు ధర కరువైంది. చిరుధాన్యాల పరిస్థితి ఇందుకు మినహాయింపు కాదు. సజ్జ, రాగికే ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించి.. కొర్ర, అండుకొర్ర, సామలు, వరుగు పంటలను వదిలేసింది. దీంతో చిరుధాన్యాలను సాగు చేసే రైతులు సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నారు. రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు జిల్లాలో సెప్టెంబర్ పది నాటికి 55,471 ఎకరాల్లో సజ్జను సాగు చేశారు. సాధారణ సాగు 61,775 ఎకరాలు కాగా, ఈ ఏడాది వివిధ కారణాల రీత్యా విస్తీర్ణాన్ని తగ్గించారు. కర్నూలులో 14,258, నంద్యాలలో 12,066, అనంతపురంలో 8,389, ప్రకాశంలో 7,210, తిరుపతిలో 5,045, నెల్లూరులో 2,292, కడప జిల్లాల్లో 2,008 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. సజ్జ తర్వాత రాగి 44,478, కొర్ర, సామ, వరుగు తదితర చిరు ధాన్యాలను రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల ఎకరాల్లో పండిస్తున్నారు.

రైతు కుదేలు

సజ్జ సాగు చేస్తున్న రైతులు గిట్టుబాటు ధర లేక నష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,775 కాగా, ఇంతకంటే తక్కువ ధరకు మార్కెట్లో కొనుగోలు చేయకూడదు. అయితే ప్రస్తుతం రూ.1,800 నుంచి రూ.రెండు వేల్లోపే చెల్లిస్తుండటంతో రైతులు రూ.800 నుంచి రూ.1000 వరకు నష్టపోతున్నారు. రాగులకు కనీస ధరను రూ.4,886గా ప్రకటించగా, మార్కెట్లో మాత్రం రూ.మూడు వేలకే కొంటున్నారు. చిరుధాన్యాల్లో సామలు, వరుగు, కొర్రకు కనీస మద్దతు ధర ప్రకటించనే లేదు. దీంతో వీటి ధర ఎంతుంటుందో చెప్పలేని పరిస్థితి. పెరిగిన పెట్టుబడులు, తగ్గిన దిగుబడులు, లభించని మద్దతు ధరలతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. సజ్జలను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేయాలంటూ ఉదయగిరిలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ఇటీవల ఆందోళన చేపట్టారు. వ్యాపారులు సజ్జల ధరలు తగ్గించి కొంటున్న తరుణంలో ప్రభుత్వం వెంటనే స్పందించి మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాల్సి ఉంది. అయితే అది అమలుకు నోచుకోవడం లేదు.

> **రైతులకు గిట్టుబాటు కావడం లేదు**
>
> 
>
> సజ్జ పంటకు కనీస మద్దతు ధరను రూ.ఐదు వేలకు పెంచాలి. ప్రస్తుతమిస్తున్న మద్దతు ధర రూ.2,775 రైతుకు గిట్టుబాటు కాదు. ఈ ధరకు మార్కెట్లో కొనుగోలు చేయడం లేదు.
>
> – వెంకటసుబ్బారెడ్డి, రైతు, సీతారామపురం

> **ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం**
>
> ప్రస్తుతం మార్కెట్లో ధరలు తక్కువగా ఉన్నాయని రైతులు చెప్తున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో మద్దత ధరకు కొనుగోలు చేస్తాం.
>
> – సత్యవాణి, జేడీ, వ్యవసాయ శాఖ, నెల్లూరు

పారిశ్రామికవాడ.. పశువులకు మేతగా..!



నారంపేట పారిశ్రామికవాడలో ఇదీ దుస్థితి

- గత ప్రభుత్వ హయాంలో ఉన్నతాశయంతో ఎమ్మెస్సెమ్‌ఈ పార్కు
- శీతకన్నేసిన కూటమి సర్కార్

ఆత్మకూరు రూరల్: మండలంలోని నారంపేటలో ఏర్పాటు చేసిన ఎమ్మెస్సెమ్‌ఈ పార్కు పశువుల మేతకు ఆవాసంగా మారింది. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పార్కుకు భూసేకరణతో పాటు సుమారు రూ.40 కోట్లకుపైగా వ్యయంతో మౌలిక వసతులను అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి కల్పించారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇదే ప్రాంతంలో పెద్ద సభను ఈ ఏడాది మేలో నిర్వహించి, పరిశ్రమలను త్వరలో స్థాపించనున్నామని ఆర్భాటంగా ప్రకటించారు. దీనికి సంబంధించిన వివరాలనూ ప్రదర్శించారు. అయితే ఆపై మిన్నకుండిపోవడంతో నారంపేటలోని పారిశ్రామికవాడ పచ్చికబయిళ్లు, పశువుల మేతకు చక్కగా ఉపయోగపడుతోంది. పరిశ్రమలను ఎప్పుడు ఏర్పాటు చేస్తారోనని ప్రజలు చర్చించుకుంటున్నారు.

తిరుమలలో క్యూలన్నీ ఖాళీ

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ బుధవారం సాధారణంగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ ఖాళీగా ఉన్నాయి. స్వామివారిని మంగళవారం అర్ధరాత్రి వరకు 63,837 మంది దర్శించుకోగా.. తలనీలాలను 20,904 మంది సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.2.85 కోట్లను సమర్పించారు. క్యూలోకి వచ్చిన భక్తులను దర్శనానికి నేరుగా అనుమతిస్తున్నారు.

పంచాయతీల విభజనకు చర్యలు

నెల్లూరు(పొగతోట): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి గ్రామ పంచాయతీల విభజనకు గానూ ప్రభుత్వానికి ప్రతిపాదనలను వచ్చే నెల 15లోపు పంపాలని డీపీఓ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీల్లో సర్పంచ్‌ల పదవీ కాలం వచ్చే ఏడాది ఏప్రిల్ రెండు నాటికి ముగియనుందని వివరించారు. ఎన్నికలకు ఏర్పాట్లు చేసేందుకు షెడ్యూల్‌ను జారీ చేశారని, ఈ క్రమంలో పంచాయతీల విభజనకు సంబంధించి ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు, డీఎల్పీఓలు ప్రతిపాదనలను సిద్ధం చేసి డీపీఓ కార్యాలయానికి పంపాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి యతిరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒలింపిక్స్ ఆసియన్ చాంపియన్‌షిప్, కామన్వెల్త్, నేషనల్ గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ, ఖేలో ఇండియా, జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని వివరించారు. భారత క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పంజాబ్‌లోని పటియాలలో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో 2025 – 26 సంవత్సరానికి ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్లో ఈ నెల 25లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నేతలు



తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశాన్ని పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, బుర్రా మధుసూదన్‌యాదవ్, నెల్లూరు రూరల్, ఉదయగిరి సమన్వయకర్తలు ఆనం విజయకుమార్‌రెడ్డి, మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగజ్జననీ.. కటాక్షించమ్మా

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు జిల్లా వ్యాప్తంగా కనులపండువగా జరుగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. మూడో రోజైన బుధవారం జగజ్జనని వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



గాయత్రి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు



రక్తబీజవధ అలంకరణలో కామాక్షితాయి



మూలాపేటలో భువనేశ్వరీదేవిగా..



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో గజలక్ష్మిగా..



కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో బాలాత్రిపురసుందరి అలంకారం



రాపూరు: పెంచలకోనలో ధాన్యలక్ష్మీదేవి అలంకరణలో ఆదిలక్ష్మీదేవి

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.40
సన్నవి	: రూ.25
పండ్లు	: రూ.15

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.117
లేయర్	: రూ.110
బ్రాయిలర్ చికెన్	: రూ.214
స్కిన్‌లెస్ చికెన్	: రూ.236
లేయర్ చికెన్	: రూ.187

కన్నపేగు విలవిల

- ఆస్తి కోసం చిత్రహింసలు పెడుతున్న బిడ్డలు
- పోలీసులను ఆశ్రయిస్తున్న బాధితులు
- మలివయసులో చట్టమే అండ

నెల్లూరు(క్రైమ్): పిల్లల్ని ప్రయోజకులను చేయాలని నిరంతరం వారు శ్రమిస్తారు. రూపాయి రూపాయి కూడబెట్టి పిల్లల భవిష్యత్‌కు బాటలు వేస్తారు. వారు ఎదుగుతున్నప్పుడు చూసి వీరు మురిసిపోతారు. పెద్దయ్యాక కొందరు తల్లిదండ్రులను చిత్రహింసలకు గురిచేస్తున్నారు. బిడ్డల ఆకలి తీరితే తమ కడుపు నిండిందని సంబరపడిన వారికి జీవిత చరమాంకంలో గుప్పెడు మెతుకులు దొరక్క కడుపులు మాడుతున్నాయి. ఆకాశమంత ఆత్మీయతను పంచిన కన్నవారిని అక్కున చేర్చుకోవాల్సిన సమయంలో ఆస్తుల కోసం నరకం చూపిస్తున్నారు. కంటికి రెప్పలా చూసుకుంటామని నమ్మించి ఇళ్లు, స్థలాలు, పొలాలు రాయించుకుని ఆపై కనికరం లేకుండా నడిరోడ్డులో వదిలేస్తున్నారు. ఆస్తుల కోసం హత్యలకూ వెనుకాడటం లేదు. కడుపున పుట్టిన బిడ్డల చేష్టలతో బెదిరిపోయిన పండుటాకులు ఇతరుల పంచన చేరి కాలం వెళ్లదీస్తున్నారు. అనేకమంది తమ కన్నీటి గాధలను ప్రతి సోమవారం నెల్లూరులో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చి న్యాయం చేయాలని అభ్యర్థిస్తున్నారు. తల్లిదండ్రులను చిత్రహింసలకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ తరహా ఫిర్యాదులు అందిన వెంటనే విచారించి కేసులు నమోదు చేస్తున్నారు.

ఇలా చేస్తే..

తల్లిదండ్రులు, వయోవృద్ధుల సంరక్షణ చట్టం – 2007 పండుటాకుల పాలిట వరం. తల్లిదండ్రులు, వృద్ధులు ఈ చట్టం కింద రక్షణ, మెయింటెనెన్స్ పొందవచ్చు. నిర్లక్ష్యానికి గురైన తల్లిదండ్రులు, వృద్ధులు నేరుగా సబ్ కలెక్టర్/ఆర్డీఓ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన ట్రిబ్యునల్‌లో కేసు వేయొచ్చు. నిస్సహాయ స్థితిలో ఉంటే మరో వ్యక్తి లేదా ఏదైనా రిజిస్ట్రరైన స్వచ్ఛంద సంస్థ సాయంతో ఫిర్యాదు చేయొచ్చు. కేసును విచారించిన ట్రిబ్యునల్ వారి జీవనానికి ఇబ్బంది లేకుండా, సంరక్షణను పిల్లలు చూసుకునేలా చేస్తుంది. నెలవారీ మెయింటెనెన్స్ సొమ్ము చెల్లించడంలో విఫలమైతే నెలరోజుల వరకు జైలుశిక్ష విధిస్తుంది. సంతానం లేని దంపతులు వారి తదనంతరం ఆస్తి ఎవరికి దక్కుతుందో ఆ బంధువుల నుంచి నిర్వహణ సొమ్మును పొందొచ్చు. ట్రిబ్యునల్ ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే జిల్లా స్థాయిలో కలెక్టర్ సారథ్యంలో ఏర్పాటు చేసిన అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను 60 రోజుల్లోపు ఆశ్రయించవచ్చు. అక్కడ నెలలోగా సమస్యను పరిష్కరిస్తారు. తమ బాగోగులు చూసుకోకపోతే బిడ్డల పేరున రాసిచ్చిన ఆస్తి దస్తావేజులను రద్దు చేసుకునే అధికారం తల్లిదండ్రులకు ఉంటుంది. పిల్లలు బలవంతంగా ఆస్తులు రాయించుకుంటే చట్టంలోని సెక్షన్ 23 కింద ఆ రిజిస్ట్రేషన్ (సేల్ డీడ్ మినహా) రద్దు చేసే అవకాశం ఉంది. సెక్షన్ 24 ప్రకారం తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసినా, హింసించినా, దాడి చేసినా మూడు నెలలు జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా లేదా రెండు విధిస్తారు.

- నెల్లూరు రూరల్ మండలం గ్రామికనగర్‌కు చెందిన మహిళను ఇబ్బందులకు గురిచేస్తున్న కుమారుడు, కుమార్తెపై వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు.
- వెంకటాచలం మండలానికి చెందిన ఓ వృద్ధుడు తన ఆస్తిని పిల్లలకు సమంగా పంచాడు. మలివయసులో తన అవసరాల నిమిత్తం రూ.3 లక్షలు దాచి పెట్టుకున్నాడు. పెద్ద కుమార్తె, ఆమె భర్త వృద్ధుడి వద్దనున్న నగదు, వృద్ధాప్య పింఛన్‌ను బలవంతంగా తీసుకుంటున్నారు. దీంతో ఆయనకు పూట గడవడమే కష్టంగా మారింది. విచారించి న్యాయం చేయాలని బాధితుడు ఎస్పీకి ఫిర్యాదు చేశారు.
- వేదాయపాళేనికి చెందిన ఓ వృద్ధుడు తన ఆస్తిని పిల్లలందరికీ సమానంగా పంచాడు. ఆయన బాగోగులను పిల్లలు పట్టించుకోలేదు. దీంతో తనపేరుపైనున్న ఆస్తిని అమ్ముకునేందుకు యత్నించగా పిల్లలు అడ్డుకున్నారు. విచారించి న్యాయం చేయాలని బాధితుడు పోలీసులను కోరారు.

గంగమ్మ తిరునాళ్లపై పచ్చనేతల కుతంత్రం

- నిలిపేయాలని నలుగురు నేతల మంకుపట్టు
- నిర్వాహకుల్ని పోలీస్‌స్టేషన్‌కు పిలిచి పంచాయితీ



బద్దిపూడిలోని గంగమ్మ గుడి

ఉలవపాడు: 'మమ్మల్ని సంప్రదించకుండా తిరునాళ్లను చేస్తారా.. ఎలా జరుగుతుందో చూస్తాం' అంటూ బద్దిపూడి గ్రామానికి చెందిన కొందరు టీడీపీ నాయకులు బహిరంగంగా అనడమే కాకుండా పోలీసులను, పంచాయతీ అధికారులను ఉసిగొల్పి పంచాయితీలు చేయడం చర్చనీయాంశమైంది. మండలంలోని బద్దిపూడి గ్రామంలో గంగమ్మ తల్లి తిరునాళ్లను ఈనెల 27వ తేదీ నుంచి మూడురోజులపాటు నిర్వహించాలని గ్రామస్తులు ఉమ్మడిగా నిర్ణయించారు. చందాలు కూడా వసూలు చేశారు. ఈ క్రమంలో టీడీపీకి చెందిన నలుగురు నాయకులు అడ్డుపుల్లలు వేయడం ప్రారంభించారు. తమను ప్రత్యేకంగా సంప్రదించలేదని చెబుతూ.. గ్రామంలో కొందరిని చందాలు ఇవ్వనీయకుండా అడ్డుకున్నారు. తిరునాళ్లను నిలిపేయాలని నియోజకవర్గ టీడీపీ ముఖ్యనేత దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో పరిస్థితిపై ఆరా తీయకుండానే ఆ నాయకుడు పోలీసులు, పంచాయతీ అధికారులకు తిరునాళ్లను ఆపాలని మౌఖికంగా ఆదేశాలివ్వడం చర్చనీయాంశమైంది.

మరో తేదీన పెట్టుకోండి

నిర్వాహక కమిటీలో సభ్యులుగా ఉన్న 14 మందిని స్టేషన్‌కు పిలిపించిన పోలీసులు 'గ్రామంలో వారికి చెప్పకుండా తిరునాళ్లను ఎందుకు చేస్తున్నారు. మరో తేదీ పెట్టుకోండి' అని సూచించడంతో అందుకు అంగీకరించారు. అయినా టీడీపీ నాయకులు ఒప్పుకోలేదు. ఆపేయాల్సిందేనని మంకుపట్టు పట్టడంతో సభ్యులను పోలీసులు మూడు పర్యాయాలు స్టేషన్‌కు పిలిపించారు. తాత్కాలికంగా నిలుపుదల చేయాలని బుధవారం పోలీసులు సూచించగా 'మా 14 మంది వల్ల సమస్య వస్తుందని టీడీపీ నాయకులు తెలియజేశారు కాబట్టి తిరునాళ్ల సమయంలో పోలీస్‌స్టేషన్ లోనే ఉంటాం. గ్రామస్తులు కార్యక్రమాలు చేసుకుంటారు. వాటిని ఆపొద్దు' అని స్పష్టం చేశారు. పోలీసులు అందుకు ససేమిరా అనడంతో తిరునాళ్లను చేసి తీరతామని నిర్వాహకులు తెగేసి చెప్పారు. నిర్వాహక కమిటీలో సగం మంది టీడీపీ సానుభూతిపరులున్నా నలుగురు వ్యక్తులు తమ పలుకుబడిని ఉపయోగించి ఆపేందుకు యత్నించడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా కమిటీలో సభ్యులు తమ ఇంటి ముందు డ్రెయినేజీపై రాకపోకల కోసం నిర్మించిన చప్టా తొలగించాలని పంచాయతీ అధికారి నోటీసులు జారీ చేయడం గమనార్హం.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై కేసు

నెల్లూరు సిటీ: రేషన్ బియ్యం అక్రమ రవాణాపై నెల్లూరు రూరల్ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. రూరల్ మండలంలోని ఓ గోదాము వద్ద రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నారని ఈనెల 21వ తేదీన సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం అందింది. వారు దాడులు చేసి ఐదు లారీలను సీజ్ చేశారు. రెండు లారీల్లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారని విచారణలో నిర్ధారించారు. ఒక లారీలో ఐదు టన్నులు, మరో దాంట్లో నాలుగు టన్నుల బియ్యం తరలింపుపై వాహన యజమాని మహేష్‌రెడ్డితోపాటు ఇద్దరు డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

13 సవర్ల బంగారం చోరీ



దొంగతనం జరిగింది ఇక్కడే..

కోవూరు: పట్టణంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మూర్తిరాజు చంద్రశేఖర్ రావు (రిటైర్డ్ లైన్‌మెన్) పాత ఆంధ్రా బ్యాంక్ సమీపంలో నివాసముంటున్నారు. ఆయన సెప్టెంబర్ 15న హైదరాబాద్ వెళ్లారు. బుధవారం ఉదయం ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో లోపలికెళ్లి చూశారు. 13 సవర్ల బంగారం చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు.

ప్రసన్నకుమార్‌రెడ్డి పరామర్శ



చిన్నారులను పరామర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట: ఇటీవల సంగం మండలంలో పెరమన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చల్లగుండ్ల శ్రీనివాసులు, లక్ష్మి మృతిచెందిన విషయం తెలిసిందే. వారి పిల్లలు చందుప్రియ, విశ్వంత్, ఇంకా బంధువులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన ఇందుకూరుపేటలోని దళితవాడలో ఉన్న వారి నివాసానికి వెళ్లి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ కోవూరు నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, కో–ఆపరేటివ్ బ్యాంక్ మాజీ చైర్మన్ గుణుపాటి సురేష్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి, నాయకులు గురజాల బుజ్జిబాబు, భాను చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలపై సోమిరెడ్డికి శ్రద్ధ లేదు



స్థానికులతో మాట్లాడుతున్న గోవర్ధన్‌రెడ్డి

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: ఇరిగేషన్‌లో దొంగ బిల్లులు చేసుకోవడంపై సోమిరెడ్డికి ఉన్న శ్రద్ధ, రైతుల సమస్యలపై లేదని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని కురిచెర్లపాడు గ్రామంలో బుధవారం రాత్రి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక అల్లాడుతుంటే సోమిరెడ్డి అసెంబ్లీ వేదికగా నాటకాలు ఆడుతున్నాడని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్న చంద్రమోహన్‌రెడ్డి సీఎం చంద్రబాబు వద్దకు వెళ్లి రైతుల సమస్యలను వివరించి గిట్టుబాటు ధర కల్పించకుండా అసెంబ్లీలో మొక్కుబడిగా మాట్లాడి చేతులు దులుపుకోవడం సిగ్గు చేటన్నారు. ఇరిగేషన్ దొంగ బిల్లుల కోసం అసెంబ్లీలో గట్టిగా మాట్లాడిన వ్యక్తి, రైతుల గిట్టుబాటు ధర గురించి ఎందుకు గట్టిగా అడగడం లేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా దొంగ బిల్లులు చేసుకుంటూ అవినీతికి పాల్పడుతున్న సోమిరెడ్డితోపాటు ఇరిగేషన్ అధికారులు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్, మట్టి, బూడిదను దోపిడీ చేస్తూ సర్వేపల్లి నియోజకవర్గాన్ని చంద్రమోహన్‌రెడ్డి అమ్మకానికి పెట్టాడని ఆరోపించారు.

మోటార్‌బైక్ దొంగల అరెస్ట్

- రూ.9 లక్షల విలువైన 10 వాహనాల స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

కోవూరు: కోవూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో వరుసగా జరిగిన మోటార్‌బైక్ దొంగతనాల కేసులో ముఠాను పోలీసులు అరెస్ట్ చేశారు. నేషనల్ హైవేపై స్టంట్స్ చేస్తూ పట్టుబడిన కావలి యువకుడు సాగర్ విచారణలో వివరాలు వెల్లడించడంతో ముఠాను పట్టుకున్నట్లుగా నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. కోవూరు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. సాగర్‌ను విచారించగా తన స్నేహితులు సుహాస్‌బాబు, ఆదర్శ గోవింద్‌తో కలిసి బైకులను చోరీ చేస్తున్నట్లు వెల్లడించాడు. పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేసి రూ.9 లక్షల విలువైన 10 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఇవి ఎక్కువ భాగం కోవూరు, కావలి ప్రాంతాల్లో చోరీ చేసినవే. నిందితులను రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన అధికారులు, సిబ్బందిని ఎస్పీ అజిత వేజెండ్ల అభినందించారు.

బస్టాండ్ సెంటర్‌లో కొండచిలువ ప్రత్యక్షం



సీతారామపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం రాత్రి కొండచిలువ ప్రత్యక్షమైంది. జనావాసాలు, దుకాణాల నడుమ హఠాత్తుగా కొండచిలువ సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అది ముళ్లచెట్లలోకి వెళ్లడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

టీడీపీ నేతకు వైఎస్సార్‌సీపీ నేత ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న నాగార్జున

నెల్లూరు సిటీ: నగరంలోని 13వ డివిజన్‌కు చెందిన టీడీపీ నేత, నారా లోకేశ్ సేవా సమితి అధ్యక్షుడు కంచి మల్లికార్జునరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న 13వ డివిజన్ కార్పొరేటర్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున ఆర్థిక సాయం చేశారు. రూ.25 వేలు అందించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ కాలు కోల్పోయి ఇబ్బంది పడుతున్న మల్లికార్జున్‌రెడ్డి పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. ఆపద సమయంలో రాజకీయాలు ముఖ్యం కాదని, మానవత్వంతో స్పందించి తమవంతు సహాయంగా అండగా నిలిచామన్నారు.

దాడి కేసులో నలుగురు హిజ్రాల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన సీఐ అన్వర్‌బాషా



మాట్లాడుతున్న సీఐ అన్వర్‌బాషా

కందుకూరు: పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న హరిణి ప్రజా వైద్యశాల సిబ్బందిపై దాడికి పాల్పడిన నలుగురు హిజ్రాలను అరెస్ట్ చేసినట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆస్పత్రి వద్దకు మంగళవారం మధ్యాహ్నం 2:45 గంటల సమయంలో నలుగురు హిజ్రాలు డబ్బు కోసం వెళ్లారు. రిసెప్షన్‌లో ఉన్న ఆదిలక్ష్మి అనే నర్సు 'డాక్టర్ భోజనానికి వెళ్లారు. మీరు తర్వాత రండి' అని వారికి సూచించింది. దీంతో ఆగ్రహించిన హిజ్రాలు తాము అడిగితే డబ్బులు ఇవ్వవా అంటూ పెద్దగా కేకలు వేశారు. బూతులు తిడుతూ అసభ్యకరంగా ప్రవర్తించారు. అంతటితో ఆగకుండా ఆదిలక్ష్మిని ఆస్పత్రి బయటకు ఈడ్చుకొచ్చి కాళ్లతో కొట్టి మూకుమ్మడిగా దాడికి పాల్పడ్డారు. హాస్పిటల్లో పనిచేసే సిబ్బంది అడ్డుకునేందుకు ప్రయత్నించినా వినకుండా ఇష్టారీతిగా ప్రవర్తించారు. దీంతో తనను చంపేస్తారని భయపడిన ఆదిలక్ష్మి తన వద్దనున్న రూ.2 వేల నగదు హిజ్రాలకు ఇచ్చేసింది. ఇంతలో చుట్టుపక్కల వారు వచ్చి ఆమెను రక్షించారు. ఈ విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరిస్తూ హిజ్రాలు అసభ్యకర ప్రవర్తనతో చుట్టుపక్కల వారిని హడలెత్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన హిజ్రాలు వలేటి లావణ్య, బత్తుల పింకీ, బుదురు సౌజన్య, కందిపాటి విజయలక్ష్మిని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. వీరంతా ప్రస్తుతం పట్టణంలోని ఉప్పుచెరువులో ఓ ఇంట్లో నివాసముంటున్నట్లు గుర్తించామన్నారు. కేసు తీవ్రత దృష్ట్యా హిజ్రాలపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

పంచాయతీల ఆర్థిక ప్రగతికి ప్రణాళికలు



గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అరుణమ్మ, అధికారులు

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(పొగతోట): గ్రామ పంచాయతీలు ఆర్థిక ప్రగతి సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అన్నారు. బుధవారం నెల్లూరు జెడ్పీ సమావేశ మందిరంలో వివిధ అంశాలపై పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామ పంచాయతీలు స్థానిక పాలనలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. ఆదాయవనరుల్లేక అనేక పంచాయతీలు సమస్యలను ఎదుర్కొంటున్నాయన్నారు. కేంద్రం విడుదల చేసే నిధులపై ఆధారపడకుండా సొంతగా ఆదాయవనరులను సిద్ధం చేసుకోవాలన్నారు. నిధుల కోసం ఎదురు చూడకుండా అవసరమైన సమయంలో సొంత నగదును ఖర్చు చేసుకునే స్థాయికి గ్రామ పంచాయతీలను తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, మాస్టర్ ట్రెయినర్లు పాల్గొన్నారు.